కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలు

- రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: అధికారం కోసం కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బాల్కొండ మండలం వన్నెల్(బి), బోదేపల్లి, చిట్టాపూర్ గ్రామాల్లో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న రాష్ట్రంలో చేయని పనులను తెలంగాణలో అధికారంలోకి వస్తే చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం సిగ్గు చేటన్నారు. బీజేపీ దేశంలోని 18 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పటికీ ఎక్కడ కూడా రైతుబంధు తరహా పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ఆ రెండు పార్టీలు కేవలం ఎన్నికల కోసం అబద్ధపు హమీలు ఇచ్చి ఓట్లు దండుకోవాలని ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. 24 గంటలు నాణ్యమైన కరెంట్‌ను సాగుకు అందిస్తున్న బీఆర్ఎస్ కావాలో, మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. పని చేసే వాడికే ఓటు వేయాలన్నారు. పని చేయకుంటే ఊళ్లోకి రానివ్వకుండా తరిమికొట్టాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. రెండు రోజుల్లో రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మిగిలిన హామీలను నెరవేరుస్తామన్నారు. బీడీ కార్మికులకు పీఎఫ్ కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా అందరికీ సౌభాగ్యలక్ష్మితో రూ.5 వేల వరకు పింఛన్‌ను క్రమంగా పెంచుతూ అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలు అడిగిన అన్ని పనులను చేయించామని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. మంత్రికి ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలు, వలగొడుగులతో ఘనస్వాగతం పలికారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, రైతు నాయకుడు కోటపాటి నరసింహనాయుడు, ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు


వన్నెల్(బి)లో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

అభివృద్ధిని విస్మరించారు

- ఎన్నికల హామీలను బీఆర్ఎస్ తుంగలో తొక్కింది
- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

నవీపేట : పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని అబ్బాపూర్(ఎం), అభంగపట్నం, మహంతం, ధర్మారం, అనంతగిరి గ్రామాల్లో సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకుండా, వాళ్ల అనుచరులకే ఇచ్చారని ఆరోపించారు. ఇళ్లు కట్టుకున్న పేదలకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై విసుగుచెందిన పేదలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని, తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు విశేష ఆదరణ లభిస్తున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాలువల మరమ్మతులు, లిఫ్టుల మరమ్మతులకు ప్రాధాన్యతనిస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు సుధాకర్ రావు, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, సాయారెడ్డి, గోపాల్, మహిపాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, భగవాన్, బాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.


అభంగపట్నంలో మాట్లాడుతున్న పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

ఈవీఎంలపై అవగాహన

వేల్పూర్: వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామ ఓటర్లకు బీఆర్ఎస్ నాయకులు ఈవీఎంలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరు, ఓటు వేసే విధానాన్ని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శోభన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

వీరజవాన్‌కు ఘననివాళి



బాల్కొండ: 75వ ఎన్‌సీసీ డేను పురస్కరించుకొని బాల్కొండ మండలం చిట్టాపూర్ వద్ద వీర జవాన్ ఎర్రం నర్సయ్య విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ 12వ ఎన్‌సీసీ బెటాలియన్ సూచన మేరకు జవాన్ నర్సయ్య విగ్రహానికి నివాళులర్పించినట్లు ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ కర్పయ్య, హవాల్దార్లు జయరాం, జహంగీర్, సర్పంచ్ వనజ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



బాల్కొండ/బోధన్: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో గ్రామ పంచాయతీలతోపాటు సాలూర మండలం ఖాజాపూర్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



నవీపేట: మండల కేంద్రానికి చెందిన యోగా మాస్టర్ శ్రీనివాస్ 28 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. హైదరాబాద్‌లోని వసంత యోగా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ గతంలో ఉన్న 32 నిమిషాల రికార్డును అధిగమించాడు. మొత్తం 35 మంది యోగా శిక్షకులు పోటీలో తలపడగా శ్రీనివాస్ రికార్డును సాధించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి రిలే దీక్షలు 114వ రోజుకు చేరాయి. కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు, లింగంగౌడ్, రఘునాథ్, అన్వర్‌మియా, నయీముద్దీన్, మోహినొద్దీన్, వికారుద్దీన్ పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ ఉంటుందన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

- కర్ణాటక పథకాలపై తప్పుడు ఆరోపణలు
- కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్

వేల్పూర్/కమ్మర్‌పల్లి: కర్ణాటకలో తమ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని, తెలంగాణలో తమ ప్రభుత్వం రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. వేల్పూర్ మండలం అమీనాపూర్, కమ్మర్‌పల్లి మండలం శ్రీరాజరాజేశ్వరినగర్‌లో సునీల్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం నియోజకవర్గానికి వచ్చిన సీఎం కేసీఆర్ మన పసుపును మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇచ్చి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, క్వింటాల్ వరి ధాన్యానికి రూ.500 బోనస్, పెట్టుబడి సహాయం కింద ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, చేయూత కింద రూ.4 వేల పింఛను, ఆరోగ్య పథకం ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్యం అందిస్తామన్నారు. నియోజకవర్గంలో అహంకారాన్ని అంతమొందించి ప్రేమను గెలిపించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించి సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆర్ఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

బీఆర్ఎస్‌కు ఆర్మూర్ కంచుకోట

- అభివృద్ధిని కాంక్షించే ప్రజలు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టడం ఖాయం
- ఎన్నికల ప్రచారంలో ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్ : పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఆర్మూర్ బీఆర్ఎస్‌కు కంచుకోటలా మారిందని ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని 15,16,17,20,22వ వార్డుల్లో ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని కాంక్షించే ప్రజలు తనకు హ్యాట్రిక్ కట్టబెట్టడం ఖాయమని అన్నారు. ఆర్మూర్ పట్టణంలో రోడ్లు కళకళలాడుతున్నాయని, ఆధునిక డ్రైనేజీలు వచ్చాయన్నారు. పెర్కిట్ చెరువు, రెడ్డిచెరువుల్లో కాలుష్య నివారణ పనులు, మోడ్రన్ దోబీఘాట్, గూండ్లచెరువు టూరిజం అభివృద్ధి పనులు, వెజ్-నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం, కోట్లాది రూపాయల వ్యయంతో సిద్ధులగుట్ట ఘాట్ రోడ్డు, అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ, డివైడర్ల నిర్మాణం వంటి ఎన్నో పనులు అభివృద్ధికి అద్దం పడుతున్నాయన్నారు. ఒకప్పుడు మంచినీటికోసం ఇబ్బందులు పడగా, ఇప్పుడు ఇంటింటికీ నీరు సరఫరా అవుతున్నదన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలాంటి అరాచకశక్తులకు ఆదరణ లేదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే ఆర్మూర్ నియోజకవర్గానికి న్యాయం జరిగిందన్నారు. ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి మరింత శ్రమిస్తానని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నందిపేట్ మండలంలో..

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద, వెల్మల్ గ్రామాల్లో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన తల్వేద, వెల్మల్ గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రెండు గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేయించానన్నారు. నందిపేట్-జన్నేపల్లి మెయిన్ రోడ్డు నుంచి తల్వేద రోడ్డుకు రూ.56 లక్షలు, తల్వేద లిఫ్టు మరమ్మతుల కోసం రూ. 2.96 కోట్లు, పంచాయతీ భవనానికి రూ. 16 లక్షలు తెచ్చానని వివరించారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు.

బీడీ టేకేదార్ల మద్దతు

ఆర్మూర్ నియోజకవర్గంలోని బీడీ టేకేదార్లు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు జీవన్‌రెడ్డి సమక్షంలో ప్రకటించారు. మండలంలోని వన్నెల్(కే) గ్రామంలో ఈ మేరకు తమ మద్దతు పత్రాన్ని జీవన్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి బీడీ టేకేదార్లకు కండువాలు కప్పి మాట్లాడారు. బీడీ కార్మికులు, టేకేదార్లకు పెన్షన్ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారని, వారి సంక్షేమం కోసం మరెన్నో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు.


ప్రచారానికి హాజరైన ప్రజలు


నమూనా ఈవీఎంలో బీఆర్ఎస్ గుర్తును చూపుతున్న జీవన్‌రెడ్డి

బాల్కొండలో ఎగిరేది బీజేపీ జెండానే..

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో ఎగిరేది బీజేపీ జెండానేనని ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ ధీమా వ్యక్తం చేశారు. ఏర్గట్లలో అన్నపూర్ణమ్మ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఇప్పుడు రాష్ట్రంలోనూ అధికారంలోకి రాబోతున్నదని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎంతో మందికి రేషన్‌కార్డులు లేవని, బీజేపీ గెలవగానే ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇప్పిస్తామని అన్నారు. ఇంటిని నిర్మించుకోవడానికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఎంతో అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే నీతివంతమైన పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు డబ్బులు ఇస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం బీజేపీకి వేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ తోకల నర్సయ్య, నాయకులు నిమ్మల శ్రీనివాస్, గంగేశ్, లక్ష్మణ్, బొల్లి శంకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


ఏర్గట్లలో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

జోరుగా ఎన్నికల ప్రచారం


పెర్కిట్‌లో ప్రచారం చేస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్/బోధన్ టౌన్ : ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని పలువార్డుల్లో జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి, పెర్కిట్‌లో దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చౌల రాజేశ్వర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు.


బోధన్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ


ఆర్మూర్‌లో ప్రచారం చేస్తున్న రజితరెడ్డి

గిరిజనులకు పెద్దన్నగా ఉంటా

- బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తనను గెలిపిస్తే పెద్దన్నగా ఉంటానని ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి గిరిజనులకు హామీ ఇచ్చారు. మండలంలోని మానిక్‌బండార్ తండా, దుర్గానగర్ తండా, సింగంపల్లితండాల్లో రాకేశ్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గెలిచిన వెంటనే ప్రతి తండాలో సేవాలాల్‌మందిరాలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గతంలో రెండుసార్లు గెలిచిన వ్యక్తి గిరిజనులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాకేశ్‌రెడ్డికి గిరిజన మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. గిరిజన మహిళలతో కలిసి రాకేశ్‌రెడ్డి నృత్యం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్, మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, గంగోనే సంతోష్, లతాపీర్‌సింగ్, లావణ్యప్రసాద్ పాల్గొన్నారు.


గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో

బోధన్‌టౌన్(బోధన్): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఎస్పీ మేనిఫెస్టో ఉందని ఆ పార్టీ బోధన్ నియోజకవర్గ అభ్యర్థి అమర్‌నాథ్‌బాబు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మేనిఫెస్టోను రూపొందించారన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పనతోపాటు రైతుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు బీఎస్పీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సింగడి పాండు, జోనల్ ఇన్‌చార్జి అర్చన తదితరులు పాల్గొన్నారు.


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న అమర్‌నాథ్‌బాబు

బీఆర్ఎస్‌లో చేరిక

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన బీజేపీ నాయకుడు తూర్పు రాజన్న బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆయనకు మామిడిపల్లిలో గులాబీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ మేడిదాల రవిగౌడ్, ఆకుల రాము, శ్రీధర్, లక్కారం చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం



బోధన్‌రూరల్/ఆర్మూర్ టౌన్ : కార్తీక పౌర్ణమిని భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు, ఇళ్లలో కార్తీకదీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. బోధన్‌లోని శ్రీచక్రేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు, కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించారు. ఆర్మూర్ పట్టణంలోని చిన్నాబజార్‌లో ఉన్న శ్రీలక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మంగళవారం (తెలుగు)- 12.25, 7.00
టైగర్-3 (తెలుగు)-3.35, 10.10
స్క్రీన్-2 – ఆదికేశవ (తెలుగు)- 11.00, 1.50, 4.40, 7.30, 10.20
స్క్రీన్-3 – కోటా బొమ్మాళి పీఎస్ (తెలుగు)- 10.00, 1.00, 7.10, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00
స్క్రీన్-4 – టైగర్-3 (హిందీ)- 10.15,
మాధవే మధుసూదనా (తెలుగు) 4.00
సౌండ్‌పార్టీ(తెలుగు)7.00
ఫర్‌ఫూమ్ (తెలుగు) 9.45

Format C-1
For candidate to publish in Newpaper, TV
Declaration about Criminal Cases

(As per the judgment dated 25th September,2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 Public interest foundation & Ors. Vs. Union of India & Anr.)
Name and address of candidate: **SUNIL KUMAR MUTHYALA, H.No.4-105-19, Vill: Savel, Mdl: Mendora, Dist: Nizamabad-503219.**
Name of Political Party : **INDIAN NATIONAL CONGRESS PARTY**
(Independent Candidates should write "Independent" here)
Name of Election : **ASSEMBLY ELECTION NOVEMBER-2023**
Name of Constituency : **019- BALKONDA**
I, **SUNIL KUMAR MUTHYALA** (Name of candidate), a candidate for the above mentioned, Declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal cases

Sl. No.	Name of Court	Case No. and Dated	Status of Case(s)	Section(s) of Acts concerned and brief description ofOffence(s)
1	Nil	Nil	Nil	Nil
2	Nil	Nil	Nil	Nil
3	Nil	Nil	Nil	Nil

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court & date(s) of order(s)	Description of office(s) & Punishment imposed	Masximum Punishment Imposte
1	Nil	Nil	Nil
2	Nil	Nil	Nil
3	Nil	Nil	Nil

SUNIL KUMAR MUTHYALA, MLA Candidate of 019- Balkonda

రాష్ట్రంలో కుటుంబ పాలన

- బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని బోధన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని 18, 33, 37 వార్డుల్లో మోహన్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని చావిడి వద్ద ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి నిర్వీర్యమైందని, సీఎం కేసీఆర్ కుటుంబం అభివృద్ధి చెందిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి వారికి కావాల్సిన పదవులను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌ను ఓడించాలని కోరారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వడ్డి మోహన్‌రెడ్డి